సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023




లయన్స్‌క్లబ్ సేవలు భేష్

జిల్లాలోని 86 క్లబ్‌లలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అగ్రస్థానంలో నిలిచిందని, క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరి రఘు అన్నారు. 8లో▸



నమ్మించి నట్టేట ముంచారు

వృద్ధ దంపతులను నమ్మించి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపల్ పరిధిలో జరిగింది. 8లో▸



న్యూస్‌రీల్

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఇళ్లు, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ కటాఫ్ డేట్‌ను 2014 జూన్ 2 నుంచి 2020 జూన్2 వరకు పొడిగించింది. ఈ మేరకు మార్చి 17న ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అర్హత గల లబ్ధిదారులు ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరీశ్ ఒక ప్రకటనలో సూచించారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, రెగ్యులరైజ్ చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు జీఓ నంబర్ 58 కింద 18,601 దరఖాస్తులు రాగా, జీఓ నంబర్ 59 కింద 13,229 దరఖాస్తులు వచ్చాయని, జీఓ నంబర్ 58 కింద యాభై శాతం పట్టాలిచ్చామని, మరో 1,300 పట్టాలు వారం రోజుల్లో ఇవ్వనున్నట్లు చెప్పారు.

ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకా వేయించాలి

జిల్లా మాస్‌మీడియా అధికారి నరహరి



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి

షాద్‌నగర్‌రూరల్: ప్రతి చిన్నారికి తప్పనిసరి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి సూచించారు. బూర్గుల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని సోలీపూర్ సబ్‌సెంటర్ సాయిబాబా కాలనీలో కొనసాగుతున్న వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్‌లను పరిశీలించారు. టీకా వేయించుకున్న వారి వివరాలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి అన్ని రకాల వ్యాక్సిన్లు ఇవ్వాలన్నారు. అనంతరం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఎంత మంది చిన్నారులు వస్తున్నారు.. వారికి ఎలాంటి పౌష్టికాహారం ఇస్తున్నారు.. ఆరోగ్యంపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు అనే విషయాలను అంగనవాడీ టీచర్ లక్ష్మీప్రసన్నను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేరాల బాట వీడండి

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

నాగోలు: గతంలో నేరాలకు పాల్పడినవారు ఆ బాట వీడి ప్రస్తుత సమాజంలో నవజీవనాన్ని గడుపుతూ హుందాగా జీవించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ సూచించారు. శనివారం ఎల్‌బీనగర్‌లో కుషాల్ గార్డెన్స్‌లో పాత నేరస్తులలో 'మార్పు కోసం ముందడుగు' పేరుతో పాత నేరస్తులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ చౌహాన్ మాట్లాడుతూ.. గతంలో తొందరపాటులో నేరాలు చేసినా సరే తప్పు చేయని వారి కుటుంబాలు కూడా ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. నేరస్తులు గతాన్ని మరిచి మారిన మనసుతో ముందడుగు వేయాలని సూచించారు. నేరస్తులలో మార్పు తీసుకురావడం కోసం వారి కుటుంబ సభ్యుల పాత్ర చాల ముఖ్యమని పేర్కొన్నారు. జైలులో గడిపే వారికంటే నేరాలకు పాల్పడకుండా సమాజంలో మంచి పౌరులుగా ఉండే వారికి కుటుంబతో సంతోషంగా గడిపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేందర్ మాట్లాడుతూ.. నేరాలు చేసి జైలుకు వెళితే తమ కుటుంబ పరిస్థితి ఏంటనే విషయాన్ని ఆలోచించాలని సూచించారు. సమాజంలో గౌరవంగా బతకాలంటే అనేక ఉపాధి మార్గాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, అదనపు డీసీపీ మధుకర్ స్వామి, డీసీపీ లక్ష్మి, ఏసీపీలు శ్రీధర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.



మహిళలకు గరుడ ప్రసాదం పంపిణీ చేస్తున్న అర్చకులు



స్వామివారి దర్శనం కోసం కిక్కిరిసిన భక్తులు



ధ్వజారోహణం

చిలుకూరు.. భక్తజన హోరు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

- ఘనంగా ధ్వజారోహణం
- గరుడప్రసాదం కోసం భారీగా తరలివచ్చిన మహిళలు

మొయినాబాద్: వేద పండితుల మంత్రోశ్చరణలు.. భక్తుల గోవింద నామస్మరణలతో చిలుకూరు బాలాజీ దేవాలయం మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. గరుత్మంతునికి, ధ్వజస్తంభానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. గరుత్మంతుని పటాన్ని పల్లకిలో ప్రతిష్ఠించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ధ్వజస్తంభానికి ఆవిష్కరించారు. నవకలశ స్నాపకం, గరుత్మంతుని ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టారు. గరుడ పటానికి నాలుగు దిక్కుల గరుత్మంతుని రూపాలు ప్రతిష్ఠించి నైవేద్యం సమర్పించారు. అనంతరం గరుత్మంతునికి నైవేద్యంగా సమర్పించిన గరుడ ప్రసాదాన్ని సంతానంలేని మహిళలకు పంపిణీ చేశారు. గరుడ ప్రసాదం స్వీకరించేందుకు మహిళలు ఉదయం 5 గంటల నుంచే ఆలయానికి చేరుకుని క్యూకట్టారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్, కన్వీనర్ గోపాలకష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నర్సింహన్, కన్నయ్య, కిట్టు స్వామి, మురళి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు పడ్డ భక్తులు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయం బయటి వరకు క్యూ కట్టారు. స్వామివారి దర్శనానికి ఒక్కసారిగా రావడంతో వారిని నియంత్రించేవారు లేకుండాపోయారు. అదే సమయంలో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ రావడంతో గందరగోళం ఏర్పడింది. గవర్నర్ రాకతో సాధారణ భక్తులను నిలిపివేయడం.. చిన్న పిల్లలతో వచ్చిన భక్తులు, వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు లేకపోవడంతో క్యూలైన్లలో ఇబ్బంది పడాల్సి వచ్చింది. ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తాయి. ఆలయ పరిసరాల్లో సరైన పార్కింగ్ లేకపోవడం, ట్రాఫిక్ జాం కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గోప వాహనంపై, సాయంత్రం హనుమంత వాహనంపై స్వామివారిని ఊరేగిస్తారు.

స్వామివారి సన్నిధిలో హర్యానా గవర్నర్



స్వామివారిని దర్శించుకుంటున్న దత్తాత్రేయ

భక్తి మార్గమే.. ముక్తి మార్గమని.. యువత భక్తి మార్గాన్ని అనుసరించాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి మాలను వేసి ఆశీస్సులు అందజేశారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల సమయంలో ఇక్కడికి రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. చిలుకూరు గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోందన్నారు.

పది.. రెడీ

- రేపటి నుంచి టెన్త్ వార్షిక పరీక్షలు
- ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు
- 226 పరీక్ష కేంద్రాలు.. 49,754 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



శేరిలింగంపల్లిలో సీటింగ్ అరేంజ్‌మెంట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ సుశీందర్ రావు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సీసీ కెమెరాల నిఘా మధ్య అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించనున్నారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 226 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 961 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 25,214 మంది బాలురు, 24,540 మంది బాలికలు మొత్తం 49,754 మంది హాజరు కానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఒక్కో సెంటర్‌కు పది మంది చొప్పున మొత్తం 2,260 మంది ఇన్విజిలేటర్లను, పది ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను సిద్ధం చేశారు. హాల్ టికెట్లను ఇప్పటికే విద్యార్థులకు అందించారు.

నిర్దేశిత సమయానికి ముందే..

విద్యార్థులు నిర్దేశిత సమయానికి ముందే ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంది. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన వారిని కూడా అనుమతించనున్నారు. ఆ తర్వాత వచ్చిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోరు. పరీక్ష కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్, మూత్ర శాలలు, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలను సమకూర్చారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రథమ చికిత్స అందించేందుకు ఒక స్టాఫ్ నర్సు సహా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు సిద్ధం చేశారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ సహా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రాలను సీసీ కెమెరాల నిఘాలో ఓపెన్ చేసి, ఆ తర్వాత విద్యార్థులకు అందజేయనున్నారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి అనైతిక చర్యలకు పాల్పడే విద్యార్థులను గుర్తించి డిబార్ చేయనున్నారు.

పరీక్షకు హాజరు కానున్న విద్యార్థులు

మేనేజ్‌మెంట్	స్కూళ్లు	బాలురు	బాలికలు	మొత్తం విద్యార్థులు
జెడ్పీహెచ్‌ఎస్	227	6,100	6,938	13,038
ప్రభుత్వ స్కూళ్లు	4	322	73	395
ప్రైవేటు స్కూళ్లు	660	16,649	14,375	31,024
జీసీడబ్ల్యూఆర్‌ఎస్	15	499	609	1,108
కేజీబీవీ	17	-	629	629
టీఎంఆర్‌ఈఐఎస్	8	236	255	491
టీఎస్‌ఎంఎస్	11	791	888	1,679
టీఎస్‌ఆర్‌ఎస్	1	-	59	59
టీఎస్‌ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్	4	74	236	310
టీఎస్‌డబ్ల్యూఆర్	10	281	478	759
టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్	1	70	-	70
టీటీడబ్ల్యూఆర్‌ఎస్	3	192	-	192

ఆందోళన చెందొద్దు

విద్యార్థులు తొలిసారిగా బోర్డు పరీక్ష రాయబోతున్నారు. ఆందోళనకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలి. పెన్ను, హాల్ టికెట్లు వెంట తెచ్చుకోవాలి. కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు విధిగా మాస్క్ ధరించాలి. శానిటైజర్ వెంట, ఎవరి వాటర్ బాటిల్ వాళ్లే తెచ్చుకోవాలి. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇది చదువు, అది చదువు అని ఒత్తిడి చేయొద్దు. కంటి నిండా నిద్రపోయేలా చూడాలి. వేళకు తేలికగా జీర్ణమయ్యే ఆహారం వడ్డించాలి. పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. హడావుడిగా పరీక్ష కేంద్రాలకు చేరుకునే కంటే ఇంటి నుంచి అరగంట ముందే బయలుదేరడం మంచిది.

– సుశీందర్‌రావు, డీఈఓ

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పిల్లలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్


ఇబ్రహీంపట్నం రూరల్: పోషణ లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పోషణ్ పక్వాడ్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో ఆహార నియమాలు అవలంబించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం మిల్లెట్స్, సాములు, కొర్రలు, అరికెలు, జొన్న, సజ్జ, రాగి తదితర పోషకాలు కలిగిన ఆహారంపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మండలాల వారీగా పిల్లల్లో ప్రస్తుతం ఉన్న బరువు, ఉండాల్సిన బరువు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి పౌష్టికాహారం అందించేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి మోతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ప్రభాకర్, మెప్మా పీడీ అహ్మద్ సఫీఉల్లా, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌ను కలిసిన టీజీజీడీఏ వైద్యులు

గాంధీఆస్పత్రి: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం సెంట్రల్ కమిటీ, గాంధీ ఆస్పత్రి యూనిట్ ప్రతినిధులు వైద్యమంత్రి హరీశ్‌రావుతో కలిసి పలు అంశాలపై చర్చించారు. శనివారం గాంధీ ఆస్పత్రి కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీజీజీడీఏ గాంధీ యూనిట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భూపేందర్ రాథోడ్ వివరాలను వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా బోధనాస్పత్రుల్లో 250 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీనియారిటీ, స్పౌజ్ కేటగిరీలకు ప్రాధాన్యం, భార్యాభర్తలైన ప్రభుత్వ వైద్యులకు ఒకేచోట పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. తమ ప్రతిపాదనలకు మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారని డాక్టర్ రాథోడ్ తెలిపారు. పదోన్నతుల ప్రక్రియకు కృషి చేసిన డీఎంఈ రమేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీజీజీడీఏ సెంట్రల్, గాంధీ యూనిట్ కమిటీ ప్రతినిధులు పల్లం ప్రవీణ్, రంగా, అబ్బయ్య, రవి, వినోద్, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష

- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి సబితారెడ్డి
- హాజరైన జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి, చిత్రంలో జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

కందుకూరు: కేసీఆర్ నాయకత్వం మరోసారి రాష్ట్రానికి అందేలా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సామ నర్సింహారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష అని, వేరే పార్టీ వస్తే కుక్కలు చింపిన విస్తరిలా మారుతుందన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మిషన్ భగీరథ పథకం కింద కందుకూరు, మహేశ్వరం మండలాల్లోనే రూ.280 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. భూములు అమ్ముకోవద్దని రాబోయే కాలంలో ఈ ప్రాంతం మరో హైటెక్ సిటీ కానుందన్నారు. బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా అబద్ధాలను సృష్టిస్తూ ప్రచారం చేస్తోందని విమర్శించారు. ప్రధాని మోదీ ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, ప్రతి వ్యక్తి ఖాతాలో రూ.15 లక్షల సొమ్ము జమ చేస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మతం పేరుతో యువతను చెడగొడుతున్నారని ఆరోపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ ఓ కుటుంబంగా పార్టీ కోసం అందరూ కలిసి పని చేయాలన్నారు. బీజేపీ మత కల్లోలాను సృష్టించి ఓట్లను దండుకుందామని చూస్తోందని, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, బీర బాలకిషన్, అరవింద్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ విజేందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిర, జయమ్మ, ఎంపీటీసీలు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, రైతుబంధు అధ్యక్షుడు కృష్ణరాంభూపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు పి.భిక్షపతి, కాకి దశరథ, మహేందర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, అంజయ్యగౌడ్, ఈశ్వర్‌గౌడ్, పాండుగౌడ్, సామయ్య, లచ్చానాయక్, దేవేందర్, అమరేందర్‌రెడ్డి, ఆనంద్, మాణిక్యం, రామకృష్ణారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రూప్లానాయక్, ఆలీ, సమీర్, సత్యనారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు, వర్కింగ్ అధ్యక్షుడు పవన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మకంగా నటించి నట్టేట ముంచారు

- వృద్ధ దంపతుల నుంచి బంగారు ఆభరణాల అపహరణ
- బైకుపై వచ్చి దోపిడీకి పాల్పడిన దుండగులు


బాధిత వృద్ధ దంపతులు

కొత్తూరు: ఎండలో రోడ్డు పక్కన కాలినడకన వెళ్తున్న వృద్ధ దంపతులతో బైకుపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఎంతో నమ్మకంగా మెలిగారు. 'ఈ రోడ్డులో దొంగలు ఉంటారు.. మెడలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదును సంచిలో వేసుకోండి' అని సలహా ఇచ్చారు. వారి మాటలు నమ్మిన వృద్ధ దంపతులు అలాగే చేయగా వెనకాల నుంచి వచ్చి ఆభరణాలు, నగదు ఉన్న సంచిని వారు దోచుకెళ్లారు. ఈ ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఫాతీమాపూర్‌లో చేగూరు రోడ్డుపై గతనెల 31న చోటు చేసుకోగా శనివారం వెలుగుచూసింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నందిగామ మండలం వెంకమ్మగూడకు చెందిన వృద్ధ దంపతులు గుండాల మల్లయ్య(76), మల్లమ్మ(65)లు గతనెల 31న తిమ్మాపూర్‌లోని ఎస్‌బీఐ బ్యాంకుకు వచ్చి తమ ఖాతానుంచి రూ.2 వేల నగదు డ్రా చేసుకుని ఇంటికి వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకున్నారు. ఎంతకు బస్సులు, ఆటోలు రాకపోవడంతో కాలినడకన ఇంటికి బయలుదేరారు. వీరు ఫాతీమాపూర్ శివారులోకి రాగానే బైకుపై వెనకాల నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ముందు దొంగలు ఉన్నారు.. బంగారు పుస్తెల తాడు, గుండ్లు, నగదును జాగ్రత్తగా సంచిలో పెట్టుకోండని హెచ్చరించి ముందుకు వెళ్లారు. వీరి మాటలు నమ్మిన వారు ఆభరణాలు, నగదును ఓ కవర్లో చుట్టి సంచిలో వేసుకున్నారు. కొద్దిదూరం వెళ్లగానే తిరిగి వచ్చిన వారు ఆభరణాల కవర్‌ను తీసుకొని పరారయ్యారు. అనంతరం స్థానికుల సహాయంతో వృద్ధ దంపతులు ఇంటికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో వ్యవసాయం, కూలీపై ఆధారపడి జీవిస్తున్న వృద్ధ దంపతుల వద్ద దారిదోపిడీకి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు. నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.2 వేల నగదును చైన్‌స్నాచర్లు దోచుకెళ్లినట్లు మల్లమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

రాష్ట్రంలో ధనికులే ఉన్నారనడం అవివేకం

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ధనికులే ఉన్నారని మంత్రి హరీశ్‌రావు అనడం హాస్యాస్పదంగా ఉందని మాజీ చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రెక్కాడితేకాని డొక్కాడని పేదలు ఎంతోమంది ఉన్నా వారి గురించి పట్టించుకోని సర్కార్.. ధనికులే ఉన్నారని అనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ఏ.వి.ఎన్.రెడ్డి గెలుపు బీఆర్‌ఎస్ పార్టీకి చెంపపెట్టు అని అన్నారు. సొంత యూనియన్ పీఆర్‌టీయూ పార్టీ ఉన్నప్పటికీ ఎన్నికల్లో చెన్నకేశవరెడ్డికి మద్దతు ఇచ్చినప్పటికీ ఓటమిపాలయ్యారని అన్నారు. లిక్కర్ స్కామ్‌లో విచారణ జరుగుతోందని ప్రస్తుతం కేటీఆర్‌కు సంబంధించిన ఫినిక్స్ కంపెనీపై దాడులు చేయడంతో వరుసగా కుంభకోణాలు బయటకు వస్తున్నాయని ఆయన తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీకి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. సమావేశంలో సెన్సార్‌బోర్డు సభ్యుడు, జిల్లా ఉపాధ్యక్షులు నక్కలపల్లి జంగారెడ్డి, సిద్దిపేట ఇన్‌చార్జి అంజన్‌కుమార్‌గౌడ్, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్‌రెడ్డి, జొన్నాడ యాదయ్య, దర్గ మహేందర్, శ్రీరాములు, గోపాల్‌రెడ్డి, మోర నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పంచాయతీ కార్యదర్శి


సెల్‌ఫోన్ అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి నరేందర్

మహేశ్వరం: తుమ్మలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్ మానవత్వం చాటారు. రెండు రోజుల క్రితం తుక్కుగూడకు చెందిన మనీష్ తివారీ సెల్‌ఫోన్ శ్రీశైలం జాతీయ రహదారిపై పడిపోయింది. నరేందర్ హైదరాబాద్ నుంచి తుమ్మలూరు గ్రామానికి వస్తున్న సమయంలో ఫోన్ లభించింది. వెంటనే ఫోన్ యజమానికి సమాచారం అందించారు. శనివారం ఉదయం తుమ్మలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో వారికి ఫోన్ అందజేశారు.

వీధికుక్కలను నియంత్రిస్తాం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వీధికుక్కల నియంత్రణకు ఏర్పాటైన హైలెవల్ కమిటీ సూచించిన సిఫారసులను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ విజయలక్ష్మి తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన హైలెవల్ కమిటీ సభ్యులు వీధికుక్కల నియంత్రణకు 26 అంశాలు సిఫారసు చేస్తూ తమ నివేదికను శనివారం మేయర్‌కు అందజేశారు. సిఫారసులను పూర్తిస్థాయిలో సమీక్షించేందుకు కమిటీ సభ్యులతో పాటు సంబంధిత అధికారులతో మరోసారి సమావేశం నిర్వహించనున్నట్లు మేయర్ తెలిపారు.

లయన్స్‌క్లబ్ సేవలు ప్రశంసనీయం


జూలూరి రఘు, మహేందర్‌రెడ్డిని సన్మానించిన లయన్స్‌క్లబ్ సభ్యులు

- జిల్లాలోనే మొదటిస్థానంలో ఆమనగల్లు
- క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరి రఘు

కడ్తాల్: జిల్లాలోని 86 క్లబ్‌లలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు అగ్రస్థానంలో నిలిచిందని, క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరి రఘు అన్నారు. మండల పరిధిలోని మైసిగండిలో నిర్వహించిన కార్యక్రమానికి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జూలూరి రఘు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏడాది కాలంగా చేపట్టిన సేవా కార్యక్రమాలు, అభివృద్ధి పనులను తిలకించారు. క్లబ్ ఆధ్వర్యంలో కార్యక్రమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసి, క్లబ్ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జూలూరి రఘు మాట్లాడుతూ, సేవా కార్యక్రమాలతో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లుకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని అన్నారు. సేవా కార్యక్రమాలకు క్లబ్ సభ్యులు అందిస్తున్న సహకారం మరువలేనిదని కొనియాడారు. కడ్తాల్‌లోని లయన్స్ కంటి ఆస్పత్రి, మహబూబ్‌నగర్‌లోని రాంరెడ్డి లయన్స్ ఐ ఆస్పత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లుకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయని అన్నారు. లయన్స్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, రాంరెడ్డి లయన్స్ ఐ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ మాజీ గవర్నర్‌లు తదితరులు ఉన్నారు.

కార్మికులకు వారాంతపు సెలవులివ్వాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: పురపాలక సంఘంలో పని చేస్తున్న కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. శనివారం కార్మికులతో కలిసి ఆయన కమిషనర్ సాబేర్‌అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 5 లోపు కార్మికులందరికీ వేతనాలు, పెండిగ్‌లో ఉన్న సబ్బులు, నూనెలు, బట్టలు, చెప్పులు ఇవ్వాలన్నారు. వేసవికాలం కావడంతో ఎండలకు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకే పని చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు మేతరి దాసు, మేతరి నవీన్‌కుమార్, చెక్క వెంకటేష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.